క్లుప్తంగా

గురుదేవుల ఆశ్రమంలో పౌర్ణమి పూజలు



పౌర్ణమి పూజల్లో పాల్గొన్న భక్తులు

నర్సీపట్నం : మున్సిపాలిటీ ఉత్తరవాహిని నదీ తీరంలో వెలసిన శ్రీపాకలపాడు గురువుగారి ఆశ్రమంలో ఆదివారం పౌర్ణమి పూజలు ఘనంగా నిర్వహించారు. పౌర్ణమి పూజలు ఆచరించడం ద్వారా దోష నివారణ కలుగుతుందని భక్తుల విశ్వాసం. దీంతో ప్రతి పౌర్ణమి పూజలకు నర్సీపట్నం పరిసర ప్రాంతాల నుండి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి పూజల్లో పాల్గొంటారు. వందల మంది భక్తులు పౌర్ణమి పూజలు ఆచరించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆశ్రమ కమిటీ అధ్యక్షుడు రమణ మాస్టర్ ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

వరికి మేలు చేసిన భారీ వర్షం



మాకవరపాలెంలో కురుస్తున్న వర్షం

మాకవరపాలెం : భారీ వర్షం వరిపొలాలకు మేలు చేసింది. మండలంలోని 1400 హెక్టార్లలో ఈ ఖరీఫ్‌లో వరిసాగు చేపట్టారు. అయితే ఇటీవల వర్షాలు సక్రమంగా లేక నిత్యం కాస్తున్న ఎండలకు మెట్ట ప్రాంతాల్లోని పొలాల్లో వరినాట్లు ఎండిపోతున్నాయి. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం మండల కేంద్రంతోపాటు చుట్టుపక్కల గ్రామాల్లో మధ్యాహ్నం సుమారు గంటపాటు భారీ వర్షం కురిసింది. ఈ వర్షంతో వాతావరణం చల్లబడడంతోపాటు వరిపొలాలకు మేలు చేసిందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

75 మందికి ఉచిత కంటి పరీక్షలు



కంటి పరీక్షలు చేస్తున్న వైద్యురాలు

మాకవరపాలెం : ఉచిత కంటి వైద్య శిబిరంలో 75 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. విశాఖకు చెందిన శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం మండల కేంద్రంలోని మహిళా మార్ట్ వద్ద ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరానికి చుట్టుపక్కల ప్రాంతాల నుంచి కంటి సమస్యలతో ఇబ్బంది పడుతున్న 75 మంది రోగులు హాజరయ్యారు. వీరికి కంటి వైద్య నిపుణులు గౌరి పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. వీరిలో 53 మందికి ఆపరేషన్లు అవసరమని గుర్తించి విశాఖ తరలించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకుడు శివమనోహర్, క్యాంపు కో ఆర్డినేటర్ అశ్వనికుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు సన్మానం



బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు సన్మానం చేస్తున్న హెచ్ఎం వీరాంజనేయులు

కె.కోటపాడు : గుల్లేపల్లి ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులుగా పని చేసి ఇటీవల సాధారణ బదిలీల్లో వెళ్లిన ఉపాధ్యాయులకు పాఠశాలలో ఆదివారం ఘన సన్మానం జరిపారు. ప్రస్తుత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్.వీరాంజనేయులు ఈ సన్మానాన్ని నిర్వహించారు. బదిలీపై వెళ్లిన హెచ్ఎం సీడీ సత్యవతితో పాటు ఉపాధ్యాయురాలు సుమలకు దుశ్శాలువాలను వేసి జ్ఞాపికతో సత్కరించారు. పాఠశాల ఉపాధ్యాయురాలు నీలిమ, పేరెంట్స్ కమిటీ చైర్మన్ మహలక్ష్మి పాల్గొన్నారు.

క్వారీ బ్లాస్టింగ్‌లో దెబ్బతిన్న ఇళ్లకు పరిహారం ఇవ్వాలి



రాజన్నపేటలో సీపీఎం నాయకుడు గోవింద, బాధితులు

రోలుగుంట : శరభవరం పంచాయతీ శివారు రాజన్నపేట గ్రామంలో ఇటీవల సమీప క్వారీలో బ్లాస్టింగ్‌ల వల్ల రాళ్లు పడి కొన్ని గృహాలు దెబ్బతిన్నాయి. ఈ విషయాన్ని మైనింగ్, తదితర అధికారులకు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదని సీపీఎం ఆధ్వర్యంలో బాధితులు ఆదివారం ఆందోళన చేశారు. అధికారులు నిర్లక్ష్య వైఖరి వీడాలని, దెబ్బతిన్న ఇళ్లను పరిశీలించి నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. సీపీఎం నాయకుడు గోవింద ఆధ్వర్యంలో బాధితులు ఆందోళనలో పాల్గొన్నారు.

గ్రామ స్వరాజ్యంపై కూటమి కక్ష



పెదగొలుగొండపేటలో నిరుపయోగంగా ఉన్న ఆర్‌బీకే నూతన భవనం



నాతవరంలో తెరవని సచివాలయం భవనం-2

- సచివాలయాల్లో అందని సేవలు
- నూతన భవనాలపై ప్రభుత్వం నిర్లక్ష్యం
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేసిన సంక్షేమ అభివృద్ధిని కనుమరుగు చేసేందుకు కూటమి కుట్ర



సరుగుడులో శ్లాబుతోనే నిలిచిన ఆర్‌బీకే భవనం

నాతవరం : గాంధీజీ కలలు కన్నా గ్రామ స్వరాజ్యాన్ని మాజీ సీఎం వై.ఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల వద్దకు తీసుకువస్తే కూటమి ప్రభుత్వం కక్షతో కళ్ల ముందే నిర్వీర్యం చేస్తుంది. గత ప్రభుత్వంలో ప్రజలకు ఇబ్బందులు లేకుండా మండల కేంద్రాలకు వెళ్లకుండా అన్ని రకాలు పనులు సొంత గ్రామంలోనే చేసే విధంగా రూపకల్పన చేసింది. గాంధీజీ ఆశయాలకు అనుగుణంగా 2వేలు జనాభాకు సచివాలయం, ఆర్‌బీకే, హెల్త్ క్లినిక్‌లు ఏర్పాటు చేశారు. అప్పట్లో జిల్లా వ్యాప్తంగా 500పైగా సచివాలయాలు భవనాలు 450 వరకు రైతు భరోసా కేంద్రాలు 398 వరకు విలేజ్ హెల్త్ క్లినిక్‌లు భవనాలు మంజూరు చేసి నిర్మాణాలు చేపట్టారు. వాటిలో గత ప్రభుత్వ హయంలో 80 శాతం పనులు పూర్తి చేయగా మిగతా భవనాలు వివిధ దశలో అసంపూర్తి నిర్మాణాలతో ఉన్నాయి. నిర్మాణాలు పూర్తి చేసిన సచివాలయాల్లో రైతు భరోసా కేంద్రాలు విలేజ్ హెల్త్ క్లినిక్‌లతో ప్రజలకు అవసరమైన సేవలు గ్రామంలోనే అందించేవారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గాంధీజీ కలలు కన్నా గ్రామస్వరాజ్యాన్ని కక్ష కట్టిన విధంగా కనుమరుగయ్యేలా చేస్తున్నారు. ప్రజలు సచివాలయాలకు ఏపని మీద వెళ్లిన సిబ్బంది లేరని మండల కేంద్రానికి పొమ్మంటున్నారు. గత ప్రభుత్వ హయంలో జరిగిన నిర్మాణాలు తప్ప కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అసంపూర్తి పనులతో ఉన్న సచివాలయాలు, ఆర్‌బీకే, విలేజ్ హెల్త్ క్లినిక్‌లు భవనాలు పనులు ఎక్కడా పూర్తి చేయలేదు.



అలంకారప్రాయంగా పెదగొలుగొండపేటలో విలేజ్ హెల్త్ క్లినిక్ భవనం



సరుగుడులో అసంపూర్తిగా విలేజ్ క్లినిక్ నూతన భవనం

గత ప్రభుత్వ హయంలో నిర్మాణం

నియోజకవర్గంలో 61 సచివాలయాలు, 46 ఆర్‌బీకే కేంద్రాలు 38 విలేజ్ హెల్త్ క్లినిక్‌లు మంజూరు చేశారు. గత ప్రభుత్వ హయంలో అధిక శాతం పనులు పూర్తి చేయడంతో అప్పట్లో ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్‌తో ప్రారంభోత్సవాలు చేసి ప్రజలకు అక్కడే పనులు చేసేవారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అసంపూర్తి భవన నిర్మాణ పనులు పూర్తి చేయలేదు. ప్రారంభోత్సవాలు చేసిన భవనాలను వినియోగించకుండా నిరూపయోగంగా వదిలేశారు. నియోజకవర్గంలోనే సచివాలయం, ఆర్‌బీకే, విలేజి హెల్త్ క్లినిక్‌లు నూతన భవన నిర్మాణ పనులు నాతవరం మండలం పెదగొలుగొండపేట పంచాయతీలో మొదటిగా పూర్తి చేసి ప్రారంభోత్సవం చేసారు. ఈ పంచాయతీలో చేపట్టిన నిర్మాణాలను అప్పటి కలెక్టరు రవిపట్టాన్ శెట్టి స్వయంగా పరిశీలించి ఇదే విధంగా మిగతా ప్రాంతాలో పనులు యుద్ధప్రతిపాధికన పూర్తి చేయాలన్నారు. కలెక్టరు మెచ్చిన పంచాయతీలో నేడు సచివాలయం, ఆర్‌బీకే, విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాలు అలంకారప్రాయంగా దర్శనమిస్తున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆయా భవనాలపై నిర్లక్ష్యం చూపడంతో నిరుపయోగగా మారి పిచ్చి తుప్పలు మధ్యలో విష జంతువులకు నిలయంగా మారాయి. గిరిజన ప్రాంతమైన సరుగుడు పంచాయతీలో సచివాలయం, ఆర్‌బీకే, విలేజ్ హెల్త్ క్లినిక్‌ల భవన నిర్మాణాలు పనులు చేయకపోవడంతో అసంపూర్తి పనులతో ఏడాది కాలంగా దర్శనమిస్తుంది. ఇదే విధంగా అసంపూర్తిగా ఉన్న పనులు అలానే వదిలేశారు. పనులు పూర్తి చేసిన భవనాలను ఉపయోగించకుండా నిరూపయోగంగా వదిలేశారు.

ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాలేదు..



అసంపూర్తిగా ఉన్న సచివాలయం, ఆర్‌బీకే, విలేజి హెల్త్ క్లినిక్‌లు నూతన భవన నిర్మాణాల పనులు పూర్తి చేయాలని ప్రభుత్వం నుంచి అనుమతులు రాలేదు. ఆయా భవనాల నిర్మాణం ఉపాధి హమీ పథకం నిధులతో చేసేవారు. ఎం.గన్నవరంలో సచివాలయం మాత్రమే పనులు చేస్తున్నాం.

–శ్రీవెంకటేశ్వరమ్మ, జేఈ పంచాయతీరాజ్‌శాఖ

కక్ష సాధింపులా కన్పిస్తుంది..



వై.ఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో అన్ని వర్గాలకు మేలు చేశారు. కూటమి ప్రభుత్వం అసంపూర్తి భవన నిర్మాణాలు పూర్తి చేయకుండా వదిలేయడం చూస్తే కక్ష సాధింపులా కన్పిస్తుంది, గాంధీజీ ఆశయ సాధనకు అందరూ పాటుపడాలి. సచివాలయ వ్యవస్థ నిర్వీర్యం చేసేలా ఉంది.

–ఇనసప్పల పుష్ప, ఎంపీటీసీ డి.యర్రవరం

ప్రజలు గమనిస్తున్నారు..



కూటమి ప్రభుత్వం పాలన, గత వైఎస్సార్‌సీపీ హయాంలో పాలన ప్రజలు గమిస్తున్నారు. రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలు అందిస్తే ప్రజలు అదరిస్తారు. గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యాంపై నిర్లక్ష్యం చేస్తే ప్రజల నుంచి వ్యతిరేకత వస్తుంది.

–పోలుపర్తి రాధ, వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం మండలశాఖ అధ్యక్షురాలు, నాతవరం గ్రామం

అన్నదాత పోరు విజయవంతం చేయండి



మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్

నర్సీపట్నం : రైతులకు బాసటగా ఈ నెల 9న ఆర్డీవో కార్యాలయం వద్ద చేపట్టిన అన్నదాత పోరుబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ పార్టీశ్రేణులకు పిలుపునిచ్చారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఖరీఫ్ పంట సాగు చేసిన రైతులకు యూరియా కొరతతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. పంటలు పండక, పండించిన పంటలకు గిట్టు బాటు ధర లేక రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నా కూటమి ప్రభుత్వానికి కనిపించటం లేదన్నారు. ఇటువంటి తరుణంలో రైతులకు అండగా నిలవాలనే సంకల్పంతో పార్టీ అధ్యక్షుడు, మాజీ సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అన్నదాత పోరుబాట కార్యక్రమానికి పిలుపునిచ్చారన్నారు. ఖరీఫ్ ప్రారంభం నుంచి వరి పంటకు అవసరమైన యూరియా కోసం రైతులు ఇబ్బంది పడుతున్నారన్నారు. జిల్లాలో రైతులు ఆందోళనలు చేస్తున్నా ప్రభుత్వం మొద్దు నిద్ర వీడడం లేదని విమర్శించారు. జగనన్న హయాంలో రైతులు రోడ్డు మీదకు వచ్చిన దాఖలాలు లేవన్నారు. ధరల స్థిరీకరణకు రూ.3 వేల కోట్ల నిధి ఉంచారని, కోవిడ్ సమయంలోను రైతులను ఆదుకున్న ఘనత జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. రైతులను ఆదుకోవడం చేత కాక కూటమి ప్రభుత్వం చేతులెత్తేసిందన్నారు. ఈ నెల 9న రైతుల పక్షాన చేపట్టిన ఆందోళన మున్సిపల్ స్టేడియం గాంధీ విగ్రహం వద్ద నుంచి ప్రారంభమై అబిద్‌సెంటర్‌లోని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళుర్పిస్తామన్నారు. అక్కడ నుండి ర్యాలీగా ఆర్డీవో కార్యాలయానికి చేరుకుని రైతులు ఎదుర్కొంటున్న యూరియా సమస్యపై ఆర్డీవోకు వినతిపత్రం అందజేస్తామన్నారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల నుంచి పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

పీఏసీఎస్ ఆకస్మిక తనిఖీ



పీఏసీఎస్‌లో రికార్డులు పరిశీలిస్తున్న ఆర్డీవో రమణ

రోలుగుంట: నర్సీపట్నం ఆర్డీవో వి.వి.రమణ ఆదివారం స్థానిక పీఏసీఎస్‌ను తకస్మిక తనిఖీ చేశారు. రైతులకు సిబ్బంది ఎరువులు సరఫరా చేస్తున్న తీరును పరిశీలించారు. గోదాంలో ఎరువుల రకాల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. సీఈవో మహేష్‌కు ఎరువుల విక్రయాలపై పలు సూచనలు చేశారు. స్టాకు ఉన్నంత మేరకు రైతులకు అందుబాటులో ఉండి ఎరువులు అందించాలని ఆదేశించారు. తహసీల్దార్ ఎస్. నాగమ్మ పాల్గొన్నారు.

'దఫదఫాలుగా యూరియా పంపిణీ'



ఎం. కోటపాడు పీఏసీఎస్ ఎరువుల గోదాంను పరిశీలించిన డీఎల్‌డీవో నాగలక్ష్మి

మాడుగుల రూరల్ : గ్రామాల్లో యూరియా ఎరువుల కొరత లేదని, రైతులు ఇబ్బందులు పడనవసరం లేదని దఫదఫాలుగా యూరియా రైతులకు అందిస్తామని, నర్సీపట్నం డీఎల్‌డీవో కె. నాగలక్ష్మి పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలో తహసీల్దారు, ఎంపీడీఓ, ఎస్‌లు ఒక్కో అధికారి పర్యవేక్షణలో 10 గ్రామాల్లో ఆదివారం గ్రామ సభలు ఏర్పాటు చేశారు. ఎం. కోటపాడు సచివాలయంలో జరిగిన గ్రామ సభలో నర్సీపట్నం డీఎల్‌డీవో నాగలక్ష్మి మాట్లాడుతూ జిల్లాలో 24 మండలాల్లో దఫదఫాలుగా కొరత లేకుండా యూరియా సరఫరా చేస్తున్నట్టు తెలిపారు. మండలంలో 418 మెట్రిక్ టన్నులు అవసరమని జిల్లా కలెక్టర్‌కు ప్రతిపాదనలు పంపినట్టు డీఎల్‌డీవో తెలిపారు. యూరియా రెండు మూడు రోజుల్లో వస్తుందన్నారు. సహకార సంఘాల ద్వారా యూరియా సరఫరా చేసినప్పుడు, సంఘాల పరిధిలో గల గ్రామాలకు చెందిన సభ్య రైతులకు కూడా యూరియా సరఫరా చేయాలని పలువురు రైతులు డీఎల్‌డీవో దృష్టికి తీసుకొచ్చారు. గ్రామ సభలో ఎంపీడీవో కొంకి అప్పారావు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. అనంతరం స్థానిక పీఏసీఎల్ ఎరువుల గోదాంను తనిఖీ చేశారు.

చీడికాడ : ప్రతి రైతుకు యూరియా అవసరం మేరకు అందిస్తామని నర్సీపట్నం డీఎల్‌డీఓ నాగలక్ష్మి అన్నారు. ఆదివారం మండలంలోని చీడికాడలో యూరియా పంపిణీపై వినియోగంపై రైతులో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో హేమసుందరరావు, సర్పంచ్ సమాలమ్మ, కార్యదర్శి సన్యాసిరావు పాల్గొన్నారు.

ఎరువుల విక్రయాలపై అవగాహన సదస్సులు



జె.నాయుడుపాలెంలో రైతు సదస్సుల్లో మాట్లాడుతున్న తహసీల్దార్ నాగమ్మ



మామిడిపల్లి గ్రామ సభలో మాట్లాడుతున్న తహసీల్దార్ లక్ష్మీదేవి

రోలుగుంట: మండలంలో గల అన్ని పంచాయతీల్లోను జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఆదివారం ఎరువుల విక్రయాలపై అధికారులు రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. దీనిలో భాగంగా తహసీల్దార్ నాగమ్మ జె.నాయుడుపాలెం సదస్సులు మాట్లాలడుతూ ప్రభుత్వ ధరలకే ఎరువులు కొనుగోలు చేసుకోవాలన్నారు. అన్ని సచివాలయాల పరిధిలో గల రైతు భరోసా కేంద్రాల్లో అందుబాటులో ఎరువుల విక్రయాలు వ్యవసాయ సిబ్బంది ఆధ్వర్యంలో జరుగుతుందన్నారు. అలాగే రోలుగుంట పీఏసీఎస్‌లోను , ప్రైవేటు డీలరు వద్ద ఈ విక్రయాలు జరుగుతున్నాయని, వారికి ప్రభుత్వ ధరలకే విక్రయాలు చేయాలని ఆదేశాలు జారీ చేయడం జరిగిందన్నారు. ప్రభుత్వ ధరలకు మించి కొనుగోలు చేయొద్దని, అలా విక్రయాలు జరిగితే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. దళారులు, స్టాకు నిల్వలు ఎక్కడైనా ఉన్నట్టు రుజువైతే శాఖపరమైన చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు.

దేవరాపల్లి: మండలంలోని అన్ని పంచాయతీల్లో ఆదివారం గ్రామ సభలను నిర్వహించారు. స్థానిక తహసీల్దార్ లక్ష్మీదేవి, ఎంపీడీవో సువర్ణరాజు, ఎస్ఐ సత్యనారాయణ మూడు బృందాలుగా ఏర్పడి గ్రామాలలో రైతులతో గ్రామ సభలను నిర్వహించారు. ఇప్పటి వరకు ఎంత మంది రైతులు యూరియా తీసుకున్నారు,. ఇంకా ఎంత మంది తీసుకోవాల్సి ఉందనే వివరాలు సేకరించారు. గ్రామ సభలను మండల వ్యవసాయ అధికారి ఎల్.వై.కాంతమ్మ, విస్తరణ అధికారి ఎస్. కిరణ్‌కుమార్ పర్యవేక్షించారు. మామిడిపల్లిలో జరిగిన గ్రామ సభలో సర్పంచ్ కర్రి సూరినాయుడు, వైస్ ఎంపీపీ సింహాచలంనాయుడు, ఎ. కొత్తపల్లిలో జరిగిన గ్రామ సభలో సర్పంచ్ చింతల సత్య వెంకటరమణ పాల్గొన్నారు.

ఎరువుల అక్రమ విక్రయాలపై ఫిర్యాదు చేయండి

చోడవరం : ఎరువులు, యూరియా అక్రమ నిల్వలపై ఫిర్యాదు చేసేందుకు మండలస్థాయిలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని తహసీల్దార్ రామారావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండల స్థాయిలో సీఐ, ఎంపీడీఓ, మండల వ్యవసాయాధికారి, తహసీల్దార్‌తో కూడిన బృందాన్ని నియమించడం జరిగిందన్నారు. ఎక్కడైనా అక్రమ నిల్వలు, బ్లాక్ మార్కెట్ విక్రయాలు చేస్తున్నట్టు తెలిస్తే వెంటనే తమకు ఫిర్యాదు చేయాలని కోరారు. 08934294188, 8331056404, 8142936937 ఫోన్ నంబర్లకు సమాచారం ఇవ్వాలని తహసీల్దార్ కోరారు.

'ప్రతి రైతుకు ఎరువులు అందిస్తాం'



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ రమాదేవి

మాడుగుల : ప్రతి రైతుకు తప్పనిసరిగా ఎరువులు అందిస్తామని, రైతులు ఎటువంటి ఆందోళన చెందనవసరం లేదని తహసీల్దార్ కె. రమాదేవి అన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాలతో మండలంలో 23 సచివాలయాలలో రైతులతో సమావేశాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కొంత ఆలస్యమైనా ప్రతి రైతుకు యూరియా తప్పని సరిగా అందజేస్తామన్నారు. మండలంలో అన్నరకాల ఎరువులు అందుబాటులో ఉంచుతామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎడ్ల కళావతి, ఉపసర్పంచ్ జవ్వాది వరహాలు, కోపరేటివ్ సీఈవో బోరా ఈశ్వరరావు, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి కొట్నాల త్రినాథ్, పుప్పాల రమేష్ పాల్గొన్నారు.

ఇరుకు రోడ్డుతో ట్రాఫిక్ ఇక్కట్లు



పరవాడ సంతబయలులో ట్రాఫిక్ సమస్య

పరవాడ: పరవాడ సంతబయలు ప్రాంతంలో ఇరుకు రోడ్డుతో తరచూ తలెత్తుతున్న ట్రాఫిక్ సమస్యలతో గ్రామీణ ప్రజలు నిత్యం సతమతమవుతున్నారు. వాడచీపురుపల్లి, యలమంచిలి ప్రాంతాల నుంచి అనకాపల్లి, గాజువాక ప్రాంతాలకు రాకపోకలు సాగించే ఆర్టీసీ బస్సులు, ఆటోలు పరవాడ సంతబయలు మీదుగా రాకపోకలు సాగిస్తుంటాయి. పరవాడ సంతబయలు ప్రాంతం నుంచి గాజువాక, అనకాపల్లి వెళ్లే రోడ్డు మరీ ఇరుకుగా మారింది. ముందే ఇరుకు రోడ్డు ఆపై భారీ వాహనాల రాకపోకల వలన ఎదురెదురుగా వచ్చే వాహనాలు తప్పించుకొనే క్రమంలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. మంగళవారం రోజున సంతబయలులో జరిగే వారపు సంత కారణంగా ఇరుకు రోడ్డుపై వ్యాపారులు, గ్రామీణ ప్రజలు సాగిస్తున్న వ్యాపార కార్యకలాపాల వలన వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

వేడుకగా వినాయక నిమజ్జనాలు



కె.జె.పురంలో గణనాథుడి ఉరేగింపు



ఉరేగింపులో తప్పెటగుళ్ల వినోదం

మాడుగుల రూరల్ : గణపతి నవరాత్రి ఉత్సవాలు శనివారం రాత్రితో ఘనంగా ముగిసాయి. గత నెల 27న ప్రారంభమైన వినాయక చవితి ఉత్సవాలు 11 రోజుల పాటు ఘనంగా నిర్వహించారు. చంద్రగ్రహణం వల్ల శనివారం రాత్రి గణనాధులను గ్రామాల్లో ఉరేగించి, అనంతరం నదుల్లో నిమజ్జనం చేశారు. కె.జె.పురంలో 20 చోట్ల నెలకొల్పిన గణనాథులను ఉరేగించారు. తప్పెటగుల్లు, కోలాటం, సాంస్కృతిక కార్యక్రమాలతో ఊరేగించి, తాచేరులో నిమజ్జనం చేశారు. మండలంలో ఎం. కోటపాడు, ముకుందపురం, వీరవల్లి, తదితర గ్రామాల్లో గణనాథులను ఉరేగించారు. ఈ కార్యక్రమములో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

లక్ష్యసాధనలో కృషి, పట్టుదల అవసరం



నియామక పత్రాలు అందుకున్న విద్యార్థులతో శ్రీనివాసరావు, తదితరులు

మాకవరపాలెం: లక్ష్యసాధనలో కృషి, పట్టుదల అవసరమని మాజీమంత్రి, అవంతి విద్యా సంస్థల చైర్మన్ ఎం.శ్రీనివాసరావు విద్యార్థులకు సూచించారు. అవంతి ఇంజినీరింగ్ కళాశాల ఆడిటోరియంలో ఆదివారం అచీవర్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ విభాగాల నుంచి ఉద్యోగాలకు ఎంపికైన 1050 మంది విద్యార్థులకు నియామక పత్రాలు పంపిణీ చేశారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి తల్లిదండ్రుల కలలను సాకారం చేసేందుకు నిరంతరం శ్రమించాలన్నారు. విజయనగరం జేఎన్‌టీయు వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ రాజ్యలక్ష్మి మాట్లాడుతూ పరిశోధనాత్మక అభ్యాసంతో సాధ్యం కానిది ఏదీ లేదన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ మోహనరావుతోపాటు పలువురు ప్రముఖులు విద్యార్థులకు సూచనలు, సలహాలు అందించారు. కార్యక్రమంలో కళాశాల ఏవో డానియల్, అధ్యాపకులు పాల్గొన్నారు.

అన్నదాత పోరుకు తరలిరండి...



రైతులతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నేతలు

గొలుగొండ: పంటలు పండిస్తున్న రైతులకు యూరియా లేకపోవడం, ఉన్న యూరియాను బ్లాక్ మార్కెట్‌కు తరలించి అధిక అమ్మకాలు చేస్తున్న కారణంగా రాష్ట్ర వైఎస్సార్‌సీపీ పార్టీ పిలుపు మేరకు ఈనెల 9న నర్సీపట్నంలో నియోజకవర్గ స్థాయిలో జరిగే అన్నదాత పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షురాలు లోచల సుజాత, మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు పాణీశాంతారామ్, వైస్ ఎంపీపీ సుర్ల బాబ్జి తెలిపారు. ఏఎల్‌పురం మేజర్ పంచాయతీలో ఆదివారం రైతులు, పార్టీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యూరియా కొరత వల్ల రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నట్టు చెప్పారు. మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ ఆధ్వర్యంలో మంగళవారం నర్సీపట్నంలో జరిగే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు బుల్లి ప్రసాద్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

కనువిందు చేస్తున్న పచ్చదనం.



ఎ.భీమవరం పొలాల్లో పచ్చగా దర్శనమిస్తున్న వరినాట్లు

కె.కోటపాడు : ఎ.భీమవరం గ్రామంలో గల వరినాట్లు పూర్తి చేసుకున్న పోలాలన్నీ పచ్చదనంతో కళకళలాడుతున్నాయి. ఎ.భీమవరం నుండి ఎం.అలమండ వెళ్లే మార్గంలో వరినాట్లు పూర్తవడంతో ఈ పోలాలన్ని పచ్చదనంతో ఉండడంతో ప్రకృతి ప్రేమికులకు ఆకర్షిస్తున్నాయి. ఖరీఫ్‌లో భాగంగా ఇటీవల వేసిన నాట్లతో పాటు కురుస్తున్న వర్షాలకు రోడ్డును ఆనుకొని ఉన్న పొలాలు పచ్చదనంతో దర్శనమిస్తున్నాయి. ఈ మార్గంలో వెళ్లే వాహనదారులను పచ్చదనం ఆకట్టుకుంటుంది.